
# ఎనిమిది పళ్ళు

కె.ఆర్.కె.మోహన్



కాలేజీకి రీసెస్ టైం అయింది. విద్యార్థులు చాలా మంది జట్లు జట్లుగా వచ్చారు. కొందరు చాయ్ బండ్ల దగ్గర చేరి చాయ్‌లు తాగుతున్నారు. మరి కొందరు పాన్ డబ్బాల దగ్గరకు వెళ్ళి సిగరెట్లు కిళ్ళీలు కొంటున్నారు. ఇంకొందరు నలుగు రైదుగురుగా జేరి పేవ్‌మెంట్ పక్కనున్న చెట్ల నీడన నిలబడి పిచ్చాపాటీ మాట్లాడుకుంటున్నారు.

ఆ విద్యార్థులను చూస్తుంటే పున్నమ్మకి ఎంతో ముచ్చట వేసింది. ఆ అమ్మాయి తండ్రి నరసయ్య. ఆ కాలేజీ గోడ పక్కనే గానుగ చెట్టు కింద కూర్చుని పళ్లు అమ్ముకుంటాడు. నాలుగు రోజుల నుంచీ అతనికి జ్వరం వస్తూ మంచాన పడ్డాడు. ఒక్కాడితే కాని డొక్కాడని పరిస్థితి. అందుచేత ఒక్కగానొక్క

కూతురును తప్పని సరిగా పంపాల్సి వచ్చింది. వయసుతో పాటు పొగరుబోతుతనం, పోకిరీతనం కూడా ఉండే కాలేజీ కుర్రాళ్ల ముందు పదహారేళ్ల వయసున్న తన పున్నమ్మను పంపడానికి అతనికి మనసొప్ప లేదు. పంపాలనే ఉద్దేశం కూడా లేదు. కాని తానే ధైర్యం చెప్పి వచ్చింది పున్నమ్మ. పైకి బింకం చూపినా, నిజానికి మొదటి రోజున మనసులో చాలా భయం వేసింది. కాని తన తండ్రి భయపడినట్లు, తాను కొంచెం అనుమానించినట్లు ఏమీ జరగ లేదు. చాలా మంది విద్యార్థులు అసలు తన ఉనికిని పట్టించుకోనే లేదు. తన దగ్గర పళ్లు కొనడానికి వచ్చిన వాళ్లందరూ మర్యాదగానే మాట్లాడారు. కొందరు తన తండ్రి దగ్గర తరచుగా కొంటుండే వాళ్లేమో, నరసయ్య రాలేదేమని అడిగి, జ్వరం వచ్చిందని చెప్తే 'అయ్యో పాపం'అన్నారు కూడా. మరి కొందరు తన పేరు అడిగి స్కూల్లో చదువుకుంటూందని తెలుసుకొని నరసయ్య కూతుర్ని చదివిస్తూన్నందుకు సంతోషించారు కూడా.

మొదటి రోజున కాస్తో కూస్తో వుండిన చిరాకు రెండవ రోజున బొత్తిగా లేకుండాపోయింది పున్నమ్మకి. ఇస్త్రీ మడతలు నలగని యూనిఫారాలు వేసుకుని నీటుగా తయారై వచ్చే ఆ పిల్లల్ని చూస్తుంటే పున్నమ్మకి ఎంతో ముచ్చటగా అనిపించింది. తానూ చదువుకుంటోంది హైస్కూల్లో ఏదో మొక్కుబడిగా. తనకి కూడా ఇటువంటి కాలేజీల్లో చదువుకునే అదృష్టం ఏ జన్మలోనైనా ఉంటుందా? కాలేజీ సంగతి సరే. అసలు ఈ హైస్కూల్ చదువే పూర్తవుతుందా! తనకి మంచి సంబంధం చూసి పెళ్లి చేసేయాలని తండ్రి గట్టిగా ప్రయత్నిస్తున్నాడు. సంబంధం కుదిరిందంటే చదువుకి ఫుల్‌స్టాపే. తనకి కాలేజీలో చదువుకునే అదృష్టం లేక పోయినా ఆ యోగం వున్న వారిని చూస్తుంటే ఎంతో ఆనందంగా అనిపించింది ఆ అమ్మాయికి. మామూలుగా స్టూడెంట్స్ అంటే పోకిరీలు, రౌడీలు అన్న అభిప్రాయం చాలా మందికి ఉంటుంది. ఇక్కడికి రాక ముందు తనకీ అదే అభిప్రాయం ఉండేది. కాని ఇక్కడ ఎంతో మర్యాదగా తమ పనేదో తాము చూసుకుంటున్న పిల్లల్ని చూస్తుంటే తన అభిప్రాయం పూర్తిగా తప్పనిపించింది ఆ అమ్మాయికి.

"ఏం అక్కా... బాగున్నావా?" అన్న పిలుపు వినిపించింది. అటు తిరిగి చూస్తే దగ్గర్లో పేవ్‌మెంట్ గట్టు మీద కూర్చుని ఇకిలిస్తూ కనిపించాడు కిట్టిగాడు. నల్లటి శరీరం, చింపిరి జుట్టు, కుళ్లు బట్టలు - వాడిని చూస్తేనే కంపరం ఎత్తుతుంది. వాడి ఒంటి మీదున్న షర్టూ, పాంటూ ఎన్నాళ్ల నుంచో - ఎన్నేళ్ల నుంచి వేసుకున్నవో, చెమటకి తడిసి, మట్టి పేరుకు పోయి, అట్టలు కట్టి తోళ్లలాగా గట్టిపడి పోయాయి. వాడు ఎవరికి పుట్టాడో ఎవరికీ తెలియదు. వాడికే తెలీదు. గాలికి పుట్టి ధూళికి పెరిగిన వాడు. అక్కడే వుంటూ టీ బండీల దగ్గర కప్పులు కడుగుతుంటాడు. తాగగా కప్పుల్లో, గ్లాసుల్లో మిగిలిపోయిన టీని వేరే గ్లాసులో పోసుకొని తాగుతుంటాడు. ఆ బళ్ల వాళ్లకి ఉచితంగా చేసే సేవకు ప్రతిగా వాళ్లు మధ్య మధ్య కొంచెం టీని ఉచితంగా తాగిస్తుంటారు. అలాగే గప్‌చుప్ బళ్ల దగ్గర తినగా వదిలేసిన బటానీ రగడాని, కచోరీ, సమోసా ముక్కల్నీ ఏరుకు తింటాడు. ఇలా మొత్తం మీద పొట్ట నింపుకుంటూ, ఉచితంగా దొరికే గాలిని పీలుస్తూ, నీటిని తాగుతూ, కాలంతో పాటు ఎదుగుతున్నాడు.

పున్నమ్మ వచ్చిన రోజునే వాడు చనువుగా "అక్కా... నర్సయ్య రాలేదే.. నువ్వు ఆయన బిడ్డవా?' ' అని అడిగాడు.


ఎవరో ఆప్యాయంగా పలకరించడం విని అటు చూసింది కాని కిట్టిగాడి రూపం చూసే సరికి పున్నమ్మకి కడుపులో తిప్పినట్లయింది.

"అవును. నర్సయ్య మా నాయనే. ఆయనకు పానం బా " అని ముభావంగా సమాధానం చెప్పింది.

అటు తర్వాత రెండు మూడు సార్లు ఉబుసు పోక "అక్కా... బావున్నావా?" అని పలుకరించాడు. వాడి పలుకు వినగానే వెలుపరింత కలిగి వాడి వంక కొరకొరా చూస్తూ ముఖం పక్కకి తిప్పుకుంది. పున్నమ్మ ఉడుకుతుండడం చూసి సరదా పుట్టి, మరో రెండు మూడు సార్లు కవ్వించాడు కిట్టిగాడు. ఇంక వాడి వంక చూడడం కూడా మానేసింది పున్నమ్మ.

కిట్టిగాడి పిలుపు వినబడగానే ఒళ్లు మండి పోయింది పున్నమ్మకి. నీటుగా, ముచ్చటగా వున్న ఆ స్టూడెంట్స్ ముందు వాడిని చూస్తుంటే అందమైన భవంతి మీదుంచిన దిష్టిబొమ్మలాగా అనిపించింది. "ఎంతైనా మంచి కుటుంబంలో పుట్టి చక్కగా చదువుకునే వారి పద్ధతే వేరు. వాళ్ళ మర్యాదలు, సంస్కారం, మట్టిలో పుట్టి, గాలికి పెరిగే ఈ కిట్టిగాడి వంటి వెధవలకి ఎలా వస్తాయి?" అనిపించింది పున్నమ్మకి.

## కిటుకు



**బట్టల మీద కాటుక మరకలు పడితే ముందుగా కొబ్బరి నూనె అద్ది తుడిచి పౌడరు చల్లి, ఆనక ఉతకండి.**

"నాన్నకి జ్వరం త్వరగా తగ్గితే బాగుణ్ను. ఈ పీడ పోతుంది." అనుకుంది చీకటి పడే వరకూ అక్కడ విసుగ్గా కూర్చుని, అమ్ముడుకాని పళ్లను తీస్కుని ఇంటికి వెళ్లి పోయింది పున్నమ్మ.

...

మరో మూడు రోజులు గడిచాయి. నర్సయ్యకి జ్వరం బాగా తగ్గింది. కాని విపరీతమైన నీరసం. ఇంకో రెండు మూడు రోజులు గడిస్తేనే కాని బయటకి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. అది బత్తాయి పళ్ల సీజన్. పచ్చగా నిగనిగ మెరిసే బత్తాయిలు ఎక్కడ పడితే అక్కడ కనిపిస్తున్నాయి. పున్నమ్మ పళ్ల మార్కెట్ నుంచి యాభై మంచి బత్తాయి పళ్లను కొనుక్కొచ్చి రోజూ కూర్చుంచోట కూర్చుని అమ్మకానికి పెట్టింది. సరుకు బాగుందేమో, పెట్టిన రెండు మూడు గంటల్లోనే డజనున్నర పళ్లు అమ్ముడు పోయాయి.

పేవ్‌మెంట్ గట్టు మీద కూర్చున్న కిట్టిగాడు "అక్కా... బాగున్నావా?" అని ఎప్పటిలా అడిగాడు.

"శని మొదలైందా?" గొణుక్కుంటూ కొరకొరా చూసి ఊర్కొంది పున్నమ్మ.

"అంత కోపం ఎందుకక్కా... పోనీలే.. నాకు రెండు పళ్లియ్యవూ?" అన్నాడు మళ్ళీ కవ్వింపుగా.

కిట్టిగాడి ప్రశ్నలో కొంటెతనం ధ్వనించింది పున్నమ్మకి.

"ముదనష్టపోడా.. చెప్పు తీసుకు కొడతాను!' ' అంటూ రాయి తీసింది పున్నమ్మ.

కిలకిలా నవ్వుతూ అక్కడి నుంచి పారిపోయాడు కిట్టిగాడు. ఇంతలో వేరే బేరం వస్తే పున్నమ్మ దృష్టి అటు మళ్లింది.

ఆ రోజు కాలేజీలో అంతా చాలా సందడిగా

ఉంది. స్టూడెంట్స్ అందరూ రోజూ కంటే ఎక్కువగా ముస్తాబై వచ్చారు. లోపల మైకులు నించి ఏవో మాటలు, మధ్య పాటలూ, సంగీతం వినిపిస్తున్నాయి. సంగ తేమిటని అడిగితే ఆ రోజు కాలేజి యానివర్సరీ అని ఎవరో చెప్పారు.

కొంత సేపటికి లోపల జరుగుతున్న ఫంక్షన్ అయిపోయిందో, లేక మధ్యలో ఖాళీ వచ్చిందో కాని, స్టూడెంట్స్ చాలా మంది బయటకి వచ్చారు. కొందరు టీ బండి దగ్గరకి వెళ్లి చాయ్ తాగసాగారు. మరి కొందరు సమోసాలు, కచోరీలు లాగించి గప్‌చుప్‌లు జుర్రసాగారు. ఒక అర డజను మంది పున్నమ్మ దగ్గరకి వచ్చారు.

ఆ రోజు పిల్లల ఉత్సాహం మరీ ఎక్కువగా ఉండడంతో అది వారి ప్రతి మాటలోనూ కనిపిస్తోంది.

ఒక స్టూడెంట్ "ఏం.. పిల్లా... ఈ రోజు నీ పళ్ళునున్నగా నిగనిగలాడుతున్నాయే. ఎలా ఇస్తావేమిటి?" అని అడిగాడు. మిగిలిన వాళ్లు ఆ ప్రశ్నకి ముసిముసి నవ్వులు నవ్వుకున్నారు.

రోజూ ఎంతో మర్యాదగా మాట్లాడే ఆ కుర్రాడి మాటలో ఆ రోజు వెకిలితనం కనిపించింది. అయినా తమాయించుకుని "డజను పద్దెనిమిది' ' అంది పున్నమ్మ.

"అన్ని నాకెందుకు? నాకు రెండు చాలు. ఎంతిమ్మంటావో చెప్పు" అన్నాడు అతను పున్నమ్మ జాకెట్ లోపలి భాగాల్ని చూపులతో తడుముతూ.

అప్రయత్నంగా పైట సర్దుకుంది పున్నమ్మ.

"ముందు తడిమి చూసి నచ్చినవి రెండు తీసుకో. ఆ తర్వాత అమ్మాయి అడిగినంత ఇద్దువు గాని" అన్నాడు ఇంకొకడు.

అందరూ పగలబడి నవ్వారు.

పున్నమ్మకి చిర్రెత్తుకు వచ్చింది. వాళ్లని చెడామడా తిట్టాలనుకుంది. చెప్పు తీసి కొట్టాలనుకుంది. కాని తమాయించుకుంది.

"బాబూ.. మీతో ముచ్చట్లు పెట్టుకోడానికి నాకు టైంలేదు. కావాలంటే తీసుకోండి. లేకపోతే పోండి" అంది.

"తీసుకోవాలనేగా అడుగుతుంట? చెప్పు. మంచివి ఆ రెండూ ఎంతకి ఇస్తావు?" అన్నాడు అ కుర్రాడు పున్నమ్మ మెడ కింద దృష్టిని సారిస్తూ "రెండు" అనే మాటను ఒత్తి పలుకుతూ.

పున్నమ్మకి ఒళ్లు మండిపోయింది.

"పోండి బాబూ.. పొండి. మీకు నేను పళ్లు అమ్మను!" అంటూ వెళ్లిపోయే ఉద్దేశంతో పళ్లను బుట్టలో వేయ సాగింది.

"ఉండు. నువ్విచ్చే దేమిటి? నేనే తీసుకుంటాను." అంటూ గభాల్న రెండు బత్తాయిలు తీసేసుకున్నాడు ఆ అబ్బాయి.

పున్నమ్మ అవాక్కయి పోయింది. గుండె దడదడలాడింది. ఆ అమ్మాయి తేరుకొనే లోగానే ఇంకో స్టూడెంట్ "నీకేనా కావలసింది? నాకూ కావాలి" అంటూ మరో రెండు పళ్లు తీసుకున్నాడు.

రోజూ మంచిగా, మర్యాదగా ఉండే ఆ స్టూడెంట్స్‌కి ఏమైందో తెలియదు - వానరమూకలాగా పున్నమ్మ అమ్మకానికి పెట్టిన పళ్ల మీదా, పక్కన బుట్టలో వున్న పళ్ల మీదా కలబడ్డారు. ఎవరికి అందిన పళ్లు వాళ్లు పుచ్చుకుని నవ్వుకుంటూ పరుగులు మొదలు పెట్టారు.

పున్నమ్మ తేరుకుని తల బాదుకుంటూ, వాళ్లని తిడ్తూ బిగ్గరగా ఏడవడం మొదలు పెట్టింది. ఆ అమ్మాయి ఏడుస్తుంటే వాళ్లు మరింతగా ఆనందిస్తూ, పళ్లను జేబుల్లో దోపుకుని పరుగులు తీయసాగారు.

అప్పటి వరకూ ఈ విద్యార్థులు ఎంతో మంచి వాళ్లు, సంస్కారవంతులు, మర్యాదస్తులు అనుకుంది తాను. వాళ్లేనా ఇంత రాక్షసంగా ప్రవర్తిస్తోంది? పున్నమ్మ తల తిరిగిపోతోంది. పట్టపగలు, నట్టనడి రోడ్డు మీద ఇంతటి దారుణం జరుగుతున్నా, అది ఏమిటని అడిగే, లేదా కూడదని చెప్పే ధైర్యం ఎవరికీ లేకపోయింది. నోరు విప్పితే వాళ్లు తమకి ఎక్కడ అగ్గి పెట్టేస్తారోనని ఎవరి మటుకు వారికే భయం. పిల్లలు అరుస్తూ పరుగులు పెడుతుండడం చూసి ఏదో జరిగిందనుకుని, చుట్టుపక్కలనున్న దుకాణాల వాళ్లు తమ షట్టర్లను దించేశారు. భీష్మాది కురువృద్ధులు, గురు వృద్ధులున్న నిండు సభలో కౌరవులు ద్రౌపదిని వివస్త్రను చేస్తుంటే ఏమీ చేయలేక మిన్నకుండి పోయారు. చదువుకున్న వారు, మేధావులు, సంస్కార వంతులు వుండే ఆ కాలేజీ ముంగిటే అభం శుభం తెలియని పున్నమ్మకు, అసహాయురాలైన ఆ ఆడ పిల్లకు అంతటి అన్యాయం జరుగుతుంటే అడ్డ పడ్డ శ్రీకృష్ణు డెవరూ లేకపోయాడు.

విద్యార్థులు పున్నమ్మ అమ్మకానికి తెచ్చిన పళ్లను దోచుకుంటూ పారిపోతుండడం కిట్టిగాడి కంట పడింది. వాడు కూడా పరుగు పరుగున అక్కడికి వచ్చాడు. చేతికి అందినన్ని పళ్లను దొరకపుచ్చుకుని పాంటు జేబులో కుక్కుకున్నాడు. ఈ చేతిలో రెండూ, ఆ చేతిలో రెండూ పళ్లను గట్టిగా పట్టుకున్నాడు.

పళ్లను పూర్తిగా దోచుకుని విద్యార్థులు పారిపోయారు. ఇంక అరిచీ, బిగ్గరగా ఏడిచీ ప్రయోజనం లేదని ఊర్కుండి పోయింది. కన్నీరు కారుస్తున్న శిలా ప్రతిమలాగా నిలబడి పోయింది. కొంచెం తేరుకుని చూసే సరికి ఎదురుగా నిలబడి కిట్టిగాడు కనిపించాడు. వాడిని చూడగానే పున్నమ్మ కోపం కట్టలు తెంచుకుంది.

"నువ్వూ పళ్లు దోచుకున్నావుగా. ఇంకా నిలబడ్డావేం? ఇంక నా దగ్గర దోచుకోడాని కేమీ మిగల్లేదు. పో!" అని అరిచింది రుద్ధకంఠంతో.

"అది కాదక్కా... వాళ్లంతా నీ పళ్లు దోచుకు పోతుంటే చూశాను. వాళ్లని అడ్డుకోవా లనుకున్నాను. కాని ఒక్కడ్ని నేనేం చేయగలను? ఎదిరిస్తే వాళ్లు నన్ను కొడతారు. అందుకే నేనూ వాళ్లతో పాటు దోచుకుంటున్నట్లు నాటకం ఆడాను. నన్నూ సాటి దొంగనుకుని నన్నేమీ అడ్డు పెట్టలేదు. ఇవిగో ఈ ఎనిమిది పళ్లను మాత్రం నేను దక్కించ గలిగా నక్కా... తీసుకో" అంటూ జాబులోవున్న నాలుగు, చేతుల్లో వున్న నాలుగూ - మొత్తం ఎనిమిది పళ్లనూ పున్నమ్మ ముందుంచాడు కిట్టిగాడు.

